సాక్షి
సూర్యాపేట
శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



భూదానం.. వజ్రోత్సవం

భూదానోద్యమం 75వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా పోచంపల్లిలో వజ్రోత్సవాలు నిర్వహించనున్నారు. -10లో



అసమర్థులు వారే..

కృష్ణాజలాల్లో తెలంగాణ వాటా తేలేని అసమర్థులు బీఆర్‌ఎస్ పార్టీ వాళ్లేనని ఎమ్మెల్యే వీరేశం ఆరోపించారు. -10లో



స్వర్ణగిరిలో తిరుప్పావడ సేవ

భువనగిరి శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో గురువారం శ్రీవేంకటేశ్వర స్వామికి తిరుప్పావడ సేవ నిర్వహించారు. -10లో

న్యూస్‌రీల్

జడ్జిని కలిసిన బార్‌అసోసియేషన్ నేతలు



జడ్జిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి

కోదాడరూరల్ : జిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ రాధారాణి , హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ లక్ష్మణ్‌లను నూతనంగా ఎన్నికైన కోదాడ బార్ అసోసియేషన్ నాయకులు గురువారం రాష్ట్ర హైకోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి కోదాడ కోర్టు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. నూతన కోర్టు భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, కోదాడకు అదనపు జిల్లా న్యాయస్థానం ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న జూనియర్ సివిల్ జడ్జి పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు పీపీ పల్లె నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఉయ్యాల నర్సయ్య, న్యాయవాదులు మేకల వెంట్రావు, దేవబత్తిని నాగార్జునరావు, రాంరెడ్డి, చలం, హుస్సేన్, వీరభద్రరావు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ మార్కెట్ పాలకవర్గం నియామకం



చైర్‌పర్సన్‌గా రాధిక అరుణ్‌కుమార్



వైస్ చైర్‌పర్సన్‌గా స్రవంతికిషోర్‌రెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. ఈమేరకు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో పాటు 16 మంది డైరెక్టర్లను నియమిస్తూ వ్యవసాయ, సహకార శాఖ ఏపీసీ, ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు గురువారం ఉత్తర్వులు చేశారు. చైర్‌పర్సన్‌గా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామానికి చెందిన రాధికాఅరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, వైస్‌చైర్‌పర్సన్‌గా మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డిలను నియమించారు.

కక్షిదారులకు అందుబాటులో ఉండాలి



జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తిని సన్మానిస్తున్న న్యాయవాదులు

చివ్వెంల(సూర్యాపేట) : న్యాయవాదులు కక్షిదారులకు అందుబాటులో ఉండాలని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఎం.శ్యామ్‌శ్రీ అన్నారు. బదిలీ పై సికింద్రాబాద్ ఫామిలీ కోర్టుకు వెళ్తున్న ఆమెను గురువారం రాత్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కోర్టులో పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. అదే విధంగా బదిలీపై రంగారెడ్డి జిల్లా కోర్టుకు వెళ్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోపు రజిత, జూనియర్ సివిల్ జడ్జి అపూర్వ రవళి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు పాల్గొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో నిత్యారాధనలు నేత్రపర్వంగా చేపట్టారు. గురువారం వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూలకు నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి భక్తులకు స్వామి, అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు.

అవగాహన కల్పిస్తూ..
సందేహాలు తీరుస్తూ..



గరిడేపల్లిలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- భూ భారతి చట్టంపై సదస్సులకు శ్రీకారం
- ప్రయోజనాలపై మండల స్థాయిలో ప్రజలకు అవగాహన
- మొదటి రోజు గరిడేపల్లి, నేరేడుచర్లలో ప్రారంభం
- 30వరకు సదస్సుల నిర్వహణ

భానుపురి (సూర్యాపేట) : భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి – 2025 చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. దీంతో ఆరేళ్లుగా ధరణిలో ఎదురవుతున్న కష్టాల నుంచి రైతులకు ఉపశమనం కలగనుంది. భూ సమస్యల పరిష్కారం తహసీల్దార్ స్థాయిలో కాకపోతే ఆర్డీఓ.. అక్కడ కాకుంటే కలెక్టర్‌కు అప్పీలు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇందుకోసం ట్రిబ్యునల్ ఏర్పాటుపై ఓ వైపు రైతుల్లో హర్షం వ్యక్తమవుతుండగా.. మరోవైపు కొత్త చట్టం అమలు, సులభతర సేవలు, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. మొదటి రోజు జిల్లాలోని రెండు మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈనెల 30వ తేదీ వరకు ఈ సదస్సులు కొనసాగనున్నాయి.

మరో 10 రోజులు

జిల్లాలో భూభారతి చట్టం ప్రయోజనాలపై గురువారం నుంచి అవగాహన సమావేశాలు ప్రారంభమయ్యాయి. గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాల్లో జరిగిన సమావేశాలకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హాజరై ఈ చట్టంపై రైతుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఇలా రోజుకు రెండుచోట్ల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలతో పాటు రైతు వేదికల్లో ఈ సదస్సులను ఏర్పాటు చేశారు. ఈనెల 19న తిరుమలగిరి, నాగారం, 21న కోదాడ, అనంతగిరి, 22న సూర్యాపేట, పెన్‌పహాడ్, 23న మఠంపల్లి, పాలకవీడు, 24న తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెం, 25న మునగాల, నడిగూడెం, 26న ఆత్మకూర్ (ఎస్), నూతనకల్, మద్దిరాల, 28న హుజూర్‌నగర్, చిలుకూరు, 29న చివ్వెంల, మోతె, 30న మేళ్లచెర్వు, చింతలపాలెం మండలాల్లో ఉండనున్నాయి.

వేగంగా పరిష్కారానికి అవకాశం..

గతంలో భూసమస్యల పరిష్కారానికి తహసీల్దారు, ఆర్డీఓలకు ఉన్న అధికారాలను ధరణి పోర్టల్ ద్వారా కలెక్టర్లకు మాత్రమే అప్పగించడంతో భూ సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరిగింది. ఈ ధరణి అమలులోకి వచ్చిన ఆరేళ్ల కాలంలో జిల్లా వ్యాప్తంగా దాదాపు 61,021 దరఖాస్తులు రాగా.. కేవలం 35,042 దరఖాస్తులకు మాత్రమే మోక్షం లభించింది. 21,423 దరఖాస్తులను తిరస్కరించగా ఇంకా 1,035 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ దరఖాస్తులన్నీ ఏళ్లుగా పెండింగ్‌లో ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే కొత్తచట్టం ప్రకారం నిషేధిత జాబితా, పార్ట్– బీ, మిస్సింగ్ సర్వే నంబర్లు, పేర్ల మార్పు తదితర అంశాల్లో తహసీల్దార్లు, ఆర్డీఓలు అక్కడ పరిష్కారం కాకపోతే కలెక్టర్ వరకు అధికారాలను ఇవ్వడంతో సమస్యలు త్వరితగతిన పరిష్కారమై భూ హక్కులు లభించనున్నాయి. అలాగే సాదాబైనామాలకు మోక్షం కలగనుండడంతో జిల్లాలో ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న 26,900 వరకు సాదాబైనామా దరఖాస్తుదారులకు హక్కులు కల్పించే అవకాశముంటుంది.

కొత్త చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

భూభారతి చట్టం ప్రయోజనాలను వివరించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నాం. రైతులకు కలిగే ప్రయోజనాలతో పాటు ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటున్నాం. ప్రతి ఒక్కరూ ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి. ఈ చట్టం అమలుతో రైతుల భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారం అయ్యే అవకాశం ఉంటుంది.

– తేజస్ నందలాల్ పవార్, కలెక్టర్

అధికార వికేంద్రీకరణతో భూ సమస్యల పరిష్కారం: కలెక్టర్



నేరేడుచర్లలో అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు

గరిడేపల్లి, నేరేడుచర్ల: భూ భారతి చట్టం ద్వారా అధికార వికేంద్రీకరణ జరుగుతుందని తద్వారా తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిల్లో సమస్యలను పరిష్కరించే అవకాశం కలుగుతుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. భూ భారతి చట్టంపై గురువారం గరిడేపల్లి, నేరేడుచర్లలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజు భూ భారతి చట్టం అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాలోని 23 మండలాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సు జిల్లాలో మొదట గరిడేపల్లిలో ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దేశంలోనే గరిడేపల్లి మండల నుంచి అత్యధికంగా నాణ్యమైన ధాన్యం పండించి ప్రజలకు మంచి బియ్యాన్ని అందిస్తున్న రైతులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. గతంలో అమలులో ఉన్న ధరణి పోర్టల్‌లో చాలా సమస్యలు పరిష్కరించడానికి వీలు లేకుండా ఉన్నాయని, ప్రతి సమస్య కలెక్టర్ ద్వారా గానీ, కోర్టు ద్వారాగానీ పరిష్కరించే విధంగా ఉందన్నారు. దీంతో ప్రతి చిన్న సమస్యకు మారుమూల గ్రామం నుంచి సూర్యాపేట జిల్లా కేంద్రానికి వచ్చి దరఖాస్తు అందించాలంటే ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉండేదన్నారు. ఇప్పుడు భూ భారతి చట్టం ద్వారా అధికార వికేంద్రీకరణ జరిగి చాలా సులువుగా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. త్వరలో గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ పరిపాలన అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద భూ భారతి చట్టాన్ని అమలు చేస్తోందన్నారు. అనంతరం ప్రతి జిల్లాలోని ఒక్కో మండలంలో అమలు చేస్తారన్నారు. జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టం అమలు చేయనున్నట్లు చెప్పారు. 2020 అక్టోబరులో దరఖాస్తు చేసుకున్న సాదాబైనామాలను పరిశీలించి భూ భారతి చట్టం ద్వారా 13(బి)లకు పట్టాదారు పాసుపుస్తకంలో అప్డేట్ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న ప్రతి గ్రామంలో ప్రతి రైతుకి 1(బి) అందజేస్తామని ఏమైనా తప్పులు ఉంటే సరిచేస్తామని చెప్పారు. ప్రతి వ్యక్తికి ఆధార్‌కార్డు ఉన్నట్లుగానే భూమి ఉన్న రైతులకు భూధార్ అనే పేరుతో యూనిక్ నంబర్ ఇచ్చి ప్రతి భూమికి సరిహద్దులు నిర్ణయించి సర్వేలో మ్యాప్‌ని భూ భారతి పోర్టల్‌లో అప్డేట్ చేస్తామన్నారు. ఆయా సమావేశాల్లో ఎస్పీ నర్సింహ, అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓ శ్రీనివాసులు, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకవీడు, మఠంపల్లి, చింతలపాలెం మండలాల తహసీల్దార్లు కవిత, నాగార్జునరెడ్డి, సైదులు, కమలాకర్, మంగ, జ్యోతి, సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, గంటా సుధాకర్‌రెడ్డి , ఏడీ రవి, ఎంపీడీఓ సోమసుందర్, ఏపీఎం నాగేందర్, ఏఓ జావిద్, డిప్యూటీ తహసీల్దార్ మౌనిక, మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెల్లంకొండ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, మాజీ కౌన్సిలర్లు కొణతం చిన వెంకటరెడ్డి, రణపంగ నాగయ్య, బాషా, చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి నూతన కోర్టు



హుజూర్‌నగర్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ, న్యాయమూర్తులు, కలెక్టర్, ఎస్పీ, న్యాయవాదులు

- జిల్లా పోర్టు ఫోలియో జడ్జి రాధా రాణి
- వర్చువల్‌గా హుజూర్‌నగర్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

హుజూర్‌నగర్ : పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి నూతన కోర్టు ఎంతో ఉపయోగ పడుతుందని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు పోలియో జడ్జి జస్టిస్ రాధారాణి పేర్కొన్నారు. హుజూర్‌నగర్‌కు నూతనంగా మంజూరైన అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును గురువారం ఆమె హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ సుజనలతో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో పెండింగ్ భారాన్ని తగ్గించడానికి నూతన కోర్టులను మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి విన్నపం మేరకు నూతన కోర్టును మంజూరు చేశామన్నారు. నూతన కోర్టును ప్రారంభిస్తే తప్ప జడ్జిని కేటాయించడం సాధ్యం కాదని అందుకే ఈ కోర్టును ప్రారంభించామన్నారు. హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పాలకవీడు, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలోని క్రిమినల్ కేసులు, సివిల్ ఇలా మొత్తం 3,067 కేసులను నూతన కోర్టుకు కేటాయించామన్నారు. ఇక నుంచి ఆ కేసులను నూతన కోర్టులో విచారించ నున్నట్లు ఆయన చెప్పారు. జడ్జిల కొరత ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చాలా కోర్టుల్లో న్యాయమూర్తులను భర్తీ చేయలేక పోతున్నామన్నారు. త్వరలోనే నూతన కోర్టుకు న్యాయమూర్తిని కేటాయించడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. హైకోర్టు జడ్జి జస్టిస్ సుజన మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా 8000 కేసులు మాత్రమే పెండింగ్ లో ఉండగా ఒక్క హుజూర్ నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 8500 కేసులు పెండింగ్ లో ఉండటం ఆశ్చర్యపరిచిందన్నారు. పెండింగ్ కేసుల భారాన్ని పరిగణనలోకి తీసుకొని నూతన కోర్టును మంజూరు చేశామని ,త్వరలోనే న్యాయమూర్తిని కేటాయించడానికి ప్రయత్నిస్తామన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్యామ్‌శ్రీ మాట్లాడుతూ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయడం పట్ల హైకోర్టు న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కోర్టు సముదాయం, న్యాయమూర్తుల వసతి గృహాల నిర్మాణానికి హైకోర్టు జడ్జిలు అనుమతులు జారీ చేయాలని, నూతన కోర్టుకు న్యాయమూర్తిని కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 8,500 కేసులు పెండింగ్‌లో ఉండటం, జూనియర్ సివిల్ జడ్జి ట్రైనింగ్‌కు వెళ్లడంతో కోదాడ కోర్టుకు వెళ్లాల్సి వస్తోందని తద్వారా న్యాయవాదులు కక్షిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దానిని దృష్టిలో ఉంచుకొని నూతన కోర్టుకు న్యాయమూర్తిని కేటాయించాలన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్యామ్‌శ్రీతో పాటు పలువురు న్యాయమూర్తులను ఘనంగా సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నర్సింహ, హుజూర్ నగర్, కోదాడ, సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జిలు జిట్టా శ్యాం కుమార్, సురేష్, పర్వీన్ కౌసర్, జూనియర్ సివిల్ జడ్జి భవ్యశ్రీ, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అదనపు గవర్నమెంట్ ప్లీడర్లు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వచ్చేనెల 14లోగా వందశాతం పశువులకు టీకాలు

- జిల్లా ఇన్‌చార్జి పశువైద్యాధికారి డాక్టర్ రవి ప్రసాద్



చిలుకూరులో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి పశువైద్యాధికారి రవి ప్రసాద్

చిలుకూరు: వచ్చే నెల 14 వ తేదీలోగా జిల్లాలో వంద శాతం పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జిల్లా ఇన్‌చార్జి పశువైద్యాధికారి రవి ప్రసాద్ తెలిపారు. గురువారం చిలుకూరు పశువైద్యశాలలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు తమ పశువులకు తప్పని సరిగా గాలి కుంటు నివారణ టీకాలు వేయించాలని సూచించారు. పశువులు వ్యాధి బారిన పడకుండా ప్రభుత్వం ఉచితంగా అందించే ఈటీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చిలుకూరు పశు వైద్య సహాయకులుగా పని చేస్తూ పశు సంపద సహాయకులుగా పదోన్నతి పొందిన పి. శ్రీవాణిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోదాడ ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ పెంటయ్య, పశువైద్యాధికారులు వీరారెడ్డి, శ్రీనివాస్, సురేందర్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కక్షసాధింపుతోనే కాంగ్రెస్ అగ్రనేతలపై కేసులు



సూర్యాపేట పట్టణంలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

భానుపురి (సూర్యాపేట) : కాంగ్రెస్ అగ్ర నేతలపై కక్ష సాధింపులో భాగంగానే అక్రమ కేసులు బనాయించారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసు చార్జీషీట్‌లో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను చేర్చడంపై గురువారం జిల్లాకేంద్రంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అక్రమ కేసులతో గాంధీల కుటుంబాన్ని లొంగదీసుకోవాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు బనాయించినా ప్రజల కోసం, దేశం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని తెలిపారు. ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలబడతారని, దేశం కోసం త్యాగాలు చేసిన కాంగ్రెస్ పార్టీ, గాంధీల కుటుంబాన్ని అభాసు పాలు చేసే ప్రయత్నాలను ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలంగాణకు ఏపీ ఇసుక

ఆంధ్రా నుంచి అక్రమంగా రవాణా

- ఫ్లైయాష్ పేరుతో ఇసుక తరలింపు
- చెక్‌పోస్టులు లేని ప్రాంతాల నుంచి వస్తున్న లారీలు
- హైదరాబాద్‌తో పాటు నల్లగొండ జిల్లాలో విక్రయాలు



మిర్యాలగూడ రూరల్ పోలీసులు ఇటీవల పట్టుకున్న ఇసుక లారీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఆంధ్రప్రదేశ్ నుంచి కొందరు లారీల్లో ఇసుకను సరిహద్దులు దాటించి తెలంగాణలో విక్రయిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని తెలంగాణ నేతలతో కుమ్మక్కై ఈ దందాకు తెరతీసినట్లు తెలిసింది. ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా ముత్యాల, పల్నాడు జిల్లాలోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను కొందరు వ్యాపారులు లారీల్లో సామర్థ్యానికి మించి (ఒక్కో దాంట్లో 30 –35 టన్నులు) పట్టాలు కట్టి కనిపించకుండా దాచి సరిహద్దు దాటిస్తున్నారు. చెక్ పోస్టులు ఉన్న కోదాడ, నాగార్జునసాగర్, వాడపల్లి ప్రాంతాల్లో అర్ధరాత్రి వేళ ఫ్లైయాష్ పేరుతో అక్కడి సిబ్బంది కళ్లు కప్పి ఇసుకను తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మరోవైపు చెక్‌పోస్టులు లేని ప్రాంతాలైన ముత్యాల–దొండపాడు, పులిచింతల బ్రిడ్జీ, మట్టపల్లి బ్రిడ్జీ, జాన్‌పహడ్ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నట్లు తెలిసింది. ఈ నెల 14వ తేదీన మిర్యాలగూడ రూరల్ పోలీసులు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా చిన్నగంజాం నుంచి దాచేపల్లి మీదుగా హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుకను ఆ లారీలో తరలిస్తుండగా అద్దంకి – నార్కట్‌పల్లి ప్రధాన రహదారిలో మిర్యాలగూడ మండలం కిష్టాపురం సమీపంలో పట్టుకున్నట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపారు. పోలీసు వాహనాన్ని చూసి లారీ వేగంగా వెళ్తుండగా అనుమానం వచ్చి ఆపామని, లారీకి సంబంధించిన ఇసుక వివరాలను అడిగామని, ఎలాంటి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో లారీని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

మిర్యాలగూడ మీదుగా హైదరాబాద్

ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి మిర్యాలగూడలో నార్కట్‌పల్లి – అద్దంకి జాతీయ రహదారి మీదుగా హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున అర్ధరాత్రి వేళల్లో ఇసుకను తరలిస్తున్నట్లు తెలిసింది. ఇటుక బట్టీల్లో ఉపయోగించే ఫ్లైయాష్‌ను సరఫరా చేస్తున్నామని చెప్పి ఇసుకను తరలిస్తున్నారు. హైదరాబాద్‌లో సన్న ఇసుకకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉండటంతో ఏపీ నుంచి ఇసుకను తరలించి, తెలంగాణ ప్రభుత్వ ఆదాయానికి గండిగొడుతున్నారు. ఈ ఇసుకను హైదరాబాద్‌కు మాత్రమే కాకుండా నల్లగొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోనూ ఇసుకను విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఈ దందాలో తెలంగాణ రిజిస్ట్రేషన్ కలిగిన వాహనాలనే వినియోగిస్తూ అనుమానం రాకుండా వ్యవహరిస్తున్నారు. మరోవైపు మిర్యాలగూడ నియోజకవర్గంలోని మూడు రీచ్‌లు ఏడాది కాలంగా మూతపడటంతో ఈ ప్రాంతంలో ఏపీ నుంచి వస్తున్న ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. హుజూర్‌నగర్, కోదాడ, నల్లగొండ ప్రాంతాల్లోనూ ఇలా తీసుకువచ్చిన ఇసుకను విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఏపీకి చెందిన కొందరు ప్రముఖులు తెలంగాణకు చెందిన సరిహద్దు రాజకీయ నేతలతో కుమ్మక్కై ఇసుక దందాకు తెరతీశారన్న ఆరోపణలున్నాయి.

తల్లులు సరైన పోషకాహారం తీసుకోవాలి



తిమ్మాపురంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి

అర్వపల్లి: తల్లులు సరైన పోషకాహారం తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు సూచించారు. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం రైతు వేదికలో గురువారం అర్వపల్లి, తిమ్మాపురం సెక్టార్‌ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లతో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశన నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 22 వరకు గ్రామ గ్రామాన అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ శ్రీజ, ఏసీడీపీఓ రూప, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ అనిత, డాక్టర్ నగేష్‌నాయక్, ఎంఈఓ బాలునాయక్, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, సూపర్‌వైజర్ లలిత, పోషణ కోఆర్డినేటర్ శివ పాల్గొన్నారు.

కార్డియాక్ కేర్ సెంటర్ సీజ్

సూర్యాపేటటౌన్ : సూర్యాపేటలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న శరత్ కార్డియాక్ కేర్ సెంటర్‌పై వైద్యాధికారులు గురువారం దాడులు నిర్వహించారు. క్వాలిఫైడ్ డాక్టర్ పేరిట అనుమతి తీసుకుని టెక్నీషియన్ వైద్యం అందిస్తున్నట్లు గుర్తించడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం సదరు ఆసుపత్రిని గురువారం సీజ్ చేశారు. దాడుల్లో మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నరేష్ కుమార్, డాక్టర్ రాజీవ్, ఐఎంఏ సభ్యులు డాక్టర్ రమేష్ నాయక్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ కిరణ్, డాక్టర్ యశ్వంత్ రెడ్డి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ శ్రీరాంకుమార్ పాల్గొన్నారు.



కార్డియాక్ కేర్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం

పలువురు జడ్జీల బదిలీ

చివ్వెంల(సూర్యాపేట), రామగిరి(నల్లగొండ) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు జడ్జీలను బదిలీ చేస్తూ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

- సూర్యాపేట జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న పి.శ్రీవాణి బదిలీపై రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా వెళ్లారు.
- నల్లగొండ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.దీప్తి అదనపు సినియర్ సివిల్ జడ్జిగా సంగారెడ్డి కోర్టుకు బదిలీ అయ్యారు.
- నల్లగొండ జిల్లా కోర్టు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా ఆదిలాబాద్ నుంచి ప్రమీల జైన్ రానున్నారు.
- నల్లగొండ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న తేజో కార్తీక్ సంగారెడ్డి కోర్టు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు.
- సిటీ సివిల్ కోర్టు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి పురుషోత్తమరావు బదిలీపై నల్లగొండ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా రానున్నారు.
- హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి జె.శ్యాంకుమార్.. రంగారెడ్డి జిల్లా కోర్టుకు బదిలీ అయ్యారు. అక్కడ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎం.రాధాకృష్ణ చవాన్ హుజూర్‌నగర్‌కు వస్తున్నారు.
- రామన్నపేట కోర్టు సీనియర్ సివిల్ జడ్జిగా నాగ కర్నూల్ జిల్లా కోర్టు నుంచి సబిత బదిలీపై వస్తున్నారు.

క్లుప్తంగా

వృద్ధుడు అదృశ్యం


బోయ కోటయ్య. (ఫైల్)

మఠంపల్లి: మండలంలోని చౌటపల్లి గ్రామంలో వృద్ధుడు అదృశ్యమయ్యాడు. గ్రామానికి చెందిన బోయ కోటయ్య (63) మూడురోజు క్రితం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఇప్పటివరకు తిరిగి రాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 73370 79253, 76808 51539 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

సూర్యాపేటటౌన్ : మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి ఒకరోజు జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ. రమణ తీర్పునిచ్చారు. ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో సూర్యాపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఒకరిని గురువారం సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా సదరు వ్యక్తికి ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

భూదానం.. వజ్రోత్సవం

భూదానోద్యమం పురుడుపోసుకుని 74 ఏళ్లు పూర్తి


భూదాన్ పోచంపల్లిలో నిర్మించిన భూదాన స్థూపం


పోచంపల్లిలో ఏర్పాటుచేసిన వినోబా భావే, వెదిరె రామచంద్రారెడ్డిల కాంస్య విగ్రహాలు


వినోబాభావేతో మాట్లాడుతున్న వెదిరె రామచంద్రారెడ్డి (ఫైల్)

- ఆర్థిక అసమానతలు తొలగించిన భూదానం
- భూదానోద్యమం ద్వారానే దేశంలో భూసంస్కరణలు
- నేడు పోచంపల్లిలో భూదాన వజ్రోత్సవాలు

భూదాన్‌పోచంపల్లి : భూదాన ఉద్యమానికి అంకురార్పణ జరిగి నేటికి (శుక్రవారం) సరిగ్గా 74 ఏళ్లు పూర్తయ్యాయి. అడిగిందే తడవుగా వెదిరె రాంచంద్రారెడ్డి ఒకటి, కాదు రెండు కాదు.. ఏకంగా 100 ఎకరాల భూమి 1951 ఏప్రిల్ 18న దానంగా ఇచ్చి పోచంపల్లిలో భూదానోద్యమానికి నాందిపలికారు. ఈ ఘటన దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించబడింది. దాంతో పోచంపల్లికి భూదాన గంగోత్రిగా అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. భూదానోద్యమానికి బీజం పడి 75వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా భూదాన వజ్రోత్సవాలను ఏడాది పొడవునా నిర్వహించి ప్రజలలో భూదాన స్ఫూర్తిని కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు.

స్ఫూర్తినిచ్చిన భూదానం..

మహాత్మాగాంధీ శిష్యుడైన ఆచార్య వినోబాభావే దేశమంతటా పాదయాత్రలు చేస్తున్న సమయంలో సర్వోదయ నాయకుడు శ్రీ రామకృష్ణ దూత్ ఆహ్వానం మేరకు 1951 ఏప్రిల్15న హైదరాబాద్ సమీపంలోని శివరాంపల్లిలో నిర్వహించే సర్వోదయ సమ్మేళనంలో తన సందేశాన్ని ఇవ్వడానికి వచ్చారు. ఆ సమయంలో నల్లగొండ జిల్లాలో జరుగుతున్న కల్లోల పరిస్థితులను తెలుసుకొని పరిష్కార మార్గాన్ని కనుగొనడానికి వెంటనే పాదయాత్రగా బయలుదేరి 17న పోచంపల్లికి చేరుకున్నారు. సాయంత్రం హరిజనవాడలో తిరిగి ఆ రోజు రాత్రి పీర్లకొట్టం (ఇప్పుడున్న వినోబాభావే మందిరం)లో బస చేశారు. మరుసటి రోజు అనగా ఏప్రిల్ 18న చెరువు సమీపంలో నున్న జువ్విచెట్టు కింద దళితులతో సమావేశమయ్యారు. తమకు కొంత భూమిని ఇప్పిస్తే సాగు చేసుకొని జీవిస్తామని దళితులంతా తమ గోడును వెల్లబోసుకున్నారు. దాంతో వినోబాభావే స్పందిస్తూ, మీలో ఎవరైనా భూమిని దానం చేసేవారున్నారా అని అడగటంతో అక్కడే ఉన్న పోచంపల్లికి చెందిన వెదిరె రామచంద్రారెడ్డి వెంటనే లేచి తన తండ్రి జ్ఞాపకార్థం 100ఎకరాల భూమిని దానం చేస్తానని ప్రకటించి అక్కడికక్కడే దానపత్రాన్ని రాసి నిండుసభలో వినోబాభావేకు అందించారు. దాన రూపేణ లభించిన ఆ భూమిని వెంటనే పేదలకు పంచి భూదానోద్యామానికి బీజం వేశారు. దీనికి గుర్తుగా పోచంపల్లిలో భూదానస్తూపాన్ని నిర్మించారు. ఇలా ప్రారంభమైన భూదానోద్యమ స్ఫూర్తి విశ్వవ్యాప్తమై పోచంపల్లికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఇలా 100 ఎకరాలలో మెదలైన ఈ ఉద్యమం దేశమంతటా విస్తరించి 44 లక్షల ఎకరాల భూమిని దానంగా సేకరించి 40లక్షల మంది భూమి లేని నిరుపేదలకు పంచిపెట్టబడింది. మహోన్నతమైన భూదానోద్యమం భూ సంస్కరణలకు, దేశంలో ఆర్థిక అసమానతలు తొలగడానికి దోహదపడింది.

పోచంపల్లితో విడదీయని అనుబంధం

ఆచార్య వినోబాభావేకు పోచంపల్లితో విడదీయని అనుబంధం ఉంది. మొదటిసారి 1951లో పోచంపల్లికి వచ్చారు. అలాగే 1956 గాంధీ వర్ధంతి జనవరి 30న రెండోసారి వచ్చారు. భూదానోద్యమానికి కార్యోన్ముఖునిగా చేసిన పోచంపల్లిని భూదాన గంగోత్రిగా అభివర్ణిస్తూ తన రెండో జన్మస్థలంగా వినోబాభావే పేర్కొనడం విశేషం. వినోబాభావే మరణాంతరం భారత ప్రభుత్వం ఆయన అవిశ్రాంత కృషికి గాను 1982లో 'భారతరత్న' బిరుదును ప్రకటించింది.

టూరిజం పార్కులో నేడు ప్రత్యేక కార్యక్రమాలు

భూదానోద్యమం ఆవిర్భవించి 75వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా పోచంపల్లిలో శుక్రవారం భూదాన వజ్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గాంధీగ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినోబాభావే మందిరంలో ఉదయం శాంతి యజ్ఞం, ఆచార్య వినోబాభావే, ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేయనున్నట్లు తెలిపారు.

సర్వోదయ మండలి ఆధ్వర్యంలో..

భూదాన వజ్రోత్సవాలను పురస్కరించుకొని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో స్థానిక టూరిజం పార్కులో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సర్వోదయ మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్ గురువారం తెలిపారు.

ప్రారంభానికి నోచుకోని వినోబాభావే మందిరం

2012లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి పోచంపల్లిని సందర్శించిన సందర్భంగా.. శిథిలావస్థకు చేరిన వినోబాభావే మందిరాన్ని పునఃనిర్మించాలని భూదానయజ్ఞబోర్డు చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి వినతి మేరకు రూ.50లక్షలు మంజూరు చేశారు. దాంతో వినోబాభావే మందిరాన్ని 2014లో పునఃనిర్మించి నాటి భూదానోద్యమ ఫొటో గ్యాలరీని కూడా ఏర్పాటు చేశారు. కానీ, గత పదకొండు ఏళ్లుగా ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. వినోబాభావే మందిరానికి తాళం వేసి ఉండటంతో పోచంపల్లికి వచ్చిపోయే పర్యాటకులు వినోబాభావే మందిరాన్ని సందర్శించకుండానే నిరాశతో వెనుతిరిగిపోతున్నారు. భూదానోద్యమం ద్వారా మన జిల్లా, రాష్ట్రం, దేశానికి అంతర్జాతీయ స్థాయిలో కీర్తి తెచ్చిపెట్టిన వెదిరె రాంచంద్రారెడ్డి విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని వారి వారసులు గత ప్రభుత్వానికి విన్నవించినా నేటికి ఆ కల కూడా నెరవేరలేదు. అలాగే వెదిరె రాంచంద్రారెడ్డి పేరిట తపాల బిళ్లను విడుదల చేయాలని విజ్ఞప్తి చేసినా అదీ కార్యరూపం దాల్చలేదు.


మూతబడి ఉన్న వినోబాభావే మందిరం

తిరుప్పావడ సేవ


తిరుప్పావడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం స్వామి వారికి తిరుప్పావడ సేవ నిర్వహించారు. సుమారు 450 కిలోల అన్నప్రసాదం, వడ, లడ్డూ, పిండి వంటలను స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయంలో సుప్రభాత సేవ, సహస్రనామార్చన, నిత్యకల్యాణ మహోత్సవం, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ జరిపించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మానేపల్లి రామారావు, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


కార్తీక్

తిప్పర్తి: జాతీయ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు తెలంగాణ తరపున తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన క్రీడాకారుడు కార్తీక్ ఎంపిక య్యాడు. గతనెల 2న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీల్లో కార్తీక్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచడంతో జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 19, 20, 21, 22 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగే జాతీయ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు పీఈటీ అక్బర్ తెలిపారు.

19న ఎంజీయూలో అథ్లెటిక్ ఎంపిక పోటీలు

నల్లగొండ టూటౌన్: ఒడిశాలోని కలింగ యూనివర్సిటీలో ఈనెల 28 నుంచి 30 వరకు జరగనున్న యూనివర్సిటీ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంజీయూలో ఈనెల 19న ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంజీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ హరీష్‌కుమార్ గురువారం తెలిపారు. ఒడిశాలో నిర్వహించే పోటీల్లో ప్రతిభ కనభర్చిన విద్యార్థులు జూలైలో జర్మనీలో నిర్వహించే ప్రపంచ యూనివర్సిటీ పోటీల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

రోడ్డుప్రమాదంలో మహిళ మృతి


అరుణ (ఫైల్)

కేతేపల్లి: కేతేపల్లిలో గురువారం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా మోటకొండూరు గ్రామానికి చెందిన బందనాదం అరుణ(33)ఇటీవల తన తల్లిగారి ఊరైన కేతేపల్లి మండలంలోని రాయపురం గ్రామానికి వచ్చింది. ఈక్రమంలో తన ఇద్దరు పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకునేందుకు గురువారం కేతేపల్లికి వచ్చిన అరుణ స్థానిక ఎస్సీ కాలనీ సమీపంలో కాలి నడకన రోడ్డును దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీ కొట్టింది. ఈప్రమాదంలో అరుణ తలకు తీవ్రంగా గాయమైంది. సమాచారం అందుకున్న కేతేపల్లి 108 అంబులెన్స్ సిబ్బంది సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అరుణ ఆరోగ్యం విషమించి గురువారం సాయంత్రం మృతి చెందింది. కాగా.. మృతురాలి భర్త ప్రసాద్ ఏడేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు. వారికి పదేళ్ల లోపు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ మృతిచెందడంతో చిన్నారులు అనాథలుగా మారారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేతేపల్లి ఎస్ఐ శివతేజ తెలిపారు.

పెట్రోల్ పోసుకొని బాలిక ఆత్మహత్య

బీబీనగర్: మానసిక స్థితి సరిగా లేక మనోవేదనకు గురవుతున్న బాలిక ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన బీబీనగర్ మండలంలోని రుద్రవెళ్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది, స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రవెళ్లి గ్రామానికి చెందిన గుండు దీపిక(17) మానసిక స్థితి బాగోలేక గత కొంత కాలంగా ఇంట్లోనే ఉంటుంది. ఇటీవల పలుమార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మనోవేదనకు గురై గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. అరుపులు బయటకు వినిపించడంతో స్థానికులు దీపికను 108లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): కొన్ని నెలల క్రితం తల్లి మృతి చెందడంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన తిరుమలగిరి మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపెల్లి గ్రామానికి చెందిన చిత్రం కొండల్(35) భువనగిరి కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొన్ని నెలల క్రితం తన తల్లి మృతి చెందటంతో అవివాహితుడైన కొండల్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరశేఖర్ తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

- మృతుడి నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులు


కుటుంబ సభ్యులకు నేత్రదాన పత్రాలు అందజేస్తున్న నేత్రనిధి ప్రతినిధులు

మిర్యాలగూడ అర్బన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణం బంగారుగడ్డకు చెందిన గుంటి ఆదినారాయణ(65) తన స్కూటీపై పట్టణానికి వస్తున్న క్రమంలో అదే రోడ్డులో ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకుడు వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. దీంతో ఆదినారయణ తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో ఆదినారాయణ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న డైమండ్ నేత్ర నిధి ప్రతినిధులు బాధిత కుటుంబ సభ్యులను సంప్రదించగా మృతుడి నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు.

కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటా తేలేని అసమర్థులు వారే..

- మా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే ఊరుకోం
- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్: పదేళ్ల పాటు అధికారంలో ఉండి కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేలేని అసమర్థులు బీఆర్ఎస్ పార్టీ వాళ్లేనని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆరోపించారు. నకిరేకల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల విషయంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే వీరేశం ఖండించారు. 2014లో తాత్కాలికంగా 299 టీఎంసీలను తెలంగాణకు కేటాయిస్తే అవే అసంపూర్తిగా వస్తున్నాయన్నారు. గడిచిన పదేళ్లలో ఉమ్మడి జిల్లాకు కృష్ణానది నుంచి చుక్కనీరు తేలేకపోయారన్నారు. వారు నిజంగా రైతుల పక్షపాతి అయితే బ్రాహ్మణ వెల్లంల, డిండి, నక్కలగండి ప్రాజెక్టులతోపాటు, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాలువలను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటా కోసం కష్టపడుతుంటే మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా విషయంలో తాము చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. సమావేశంలో నకిరేకల్ పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, నాయకులు లింగాల వెంకన్న, కంపాసాటి శ్రీనివాస్, నకిరేకంటి నరేందర్, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, యాసారపు వెంకన్న, గడ్డం స్వామి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ప్లంబర్ మృతి


పవన్ (ఫైల్)

సంస్థాన్ నారాయణపురం: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన సంస్థాన్ నారాయణపురం మండలంలోని కొత్తగూడెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిమిర్యాల గ్రామానికి చెందిన కొల్లూరి పవన్(19) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. కొత్తగూడెం గ్రామంలో నూతన ఇంటిలో జరుగుతున్న ప్లంబర్ పనికి వెళ్లాడు. ప్లంబింగ్ మిషన్‌కు ఎర్తు రావడంతో పవన్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన చుట్టుపక్కల వారు అతడిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే పవన్ మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగన్ తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం

- బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ప్రసన్నను పరామర్శించిన తహసీల్దార్


ప్రసన్న ఇంటి వద్ద వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ నరేందర్

సాక్షి ఎఫెక్ట్..

మునుగోడు: ఆరేళ్ల చిన్నారి ప్రసన్న బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతుండగా.. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని తహసీల్దార్ నరేందర్ భరోసా ఇచ్చారు. మునుగోడు మండలంలోని కల్వలపల్లి గ్రామానికి చెందిన పగిడిమర్రి మహేష్-అనిత దంపతుల పెద్ద కుమార్తె ప్రసన్న బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆ కుటుంబ దీన గాధని గురువారం సాక్షి దినపత్రికలో ఆరేళ్ల చిన్నారికి బ్రెయిన్ క్యాన్సర్ శీర్షికన కథనం ప్రచురించింది. కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పందించి కుటుంబ పరిస్థితి పరిశీలించి నివేదిక అందించాలని మునుగోడు తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈమేరకు ప్రసన్న ఇంటికి వెళ్లి ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితులపై తహసీల్దార్ ఆరా తీశారు. అయితే కుటుంబానికి రేషన్ కార్డు లేకపోవడంతో ఎక్కడా ఉచిత వైద్యసేవలు అందడంలేదని కథనంలో ప్రచురించగా ఆ కుటుంబానికి నూతన రేషన్ కార్డు మంజూరుచేస్తామని, అందుకు అవసరమైన ప్రతిపాదనలు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కలెక్టర్‌కు నివేదిక అందజేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడేళ్లుగా తాము రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్నామని, మంజూరైతే తమ కుమార్తెకు ఆరోగ్యశ్రీ, ఇతర పథకాల ద్వారా ఉచిత వైద్యసేవలు అందుతాయని పేర్కొంటున్నారు.

పశువుల ఎరువుతో భూసారం పెంపు

పాడిపంట


పశువుల ఎరువును కుప్పలుగా పోసిన రైతులు

పెద్దవూర: ప్రస్తుతం రైతులు అధిక శాతం రసాయన ఎరువుల ద్వారానే పంటలు సాగు చేస్తున్నారు. దీంతో నేలలోని పోషకాల నిల్వల్లో సమతుల్యం లోపించి ఉత్పాదక శక్తి తగ్గుతుంది. చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాల లోపాలతో దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ సమస్యను అధిగమించాలంటే సేంద్రియ పద్ధతులు పాటించాలని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ సూచిస్తున్నారు.

సేంద్రియ ఎరువులతో..

పశువులు, మేకలు, గొర్రెల పేడ పంటల సాగుకు ఎంతగానో ఉపయోగపడతాయి. పశువుల పేడ నేల సారవంతం చేయడంలో సహాయ పడుతుంది. ఇది నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి పోషకాలు కలిగి ఉంటుంది. ఇవి మొక్కల పెరుగుదలకు అవసరం. ఇది సేంద్రియ ఎరువుతో సమానం. దీనిని దుక్కులు దున్నడానికి ముందే పంట భూముల్లో వేసి దున్నితే చాలా మంచిది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి వీలవుతోంది. దుక్కులు దున్నిన తర్వాత పశువుల పేడ మొత్తం భూమిలోకి వెళ్లి పంట దిగుబడిని పెంచడానికి దోహదపడుతుంది. పంట ఎదుగుదల, మొక్కలు బలంగా ఉండేందుకు పశువుల పేడ ఉపయోగపడుతుంది. ఒక ఎకరానికి నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ల పశువుల పెంటను వినియోగించాలి.

భూసారం పదిలం

సాధారణంగా రైతులు వేసవిలో పశువుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తుంటారు. అదే సమయంలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. అధిక ఎండల కారణంగా పొలంలో వెదజల్లితే వాటిలోని పోషకాలు ఆవిరవుతాయి. పశువుల పెంటను పొలంలో కుప్పలుగా పోసుకోవాలి. భూమిలో తగిన తేమ ఉన్న సమయంలోనే వెదజల్లి వెంటనే దుక్కిలో కలియదున్నాలి. దీనివల్ల భూసారం పెరుగుతుంది. భూమి గుల్ల బారడానికి తోడ్పడుతుంది. సహజ సిద్ధమైన లవణాలు అందుతాయి. నేలలోని ఆమ్లత్వం, క్షారత్వం, నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపు చేసి మొక్కలకు అందేవిధంగా సహాయపడతాయి. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు.

ఇలా దుక్కి దున్నాలి

దుక్కిని ఎలా పడితే అలా దున్నడం వల్ల సాగు చేసే పంటలకు నష్టం వాటిల్లుతుంది. రైతులు వేసవిలో మెట్ట భూములను వానాకాలం సీజన్ కోసం సన్నద్ధం చేస్తుంటారు. వేసవిలో వచ్చే అధిక వర్షాలకు ఎంతో సారవంతమైన మట్టి నీటి వరదకు వాలు ప్రాంతంలో కొట్టుకుపోతుంది. దీంతో మెట్ట ప్రాంతాల్లో భూమి వాలుకు అడ్డంగా దుక్కి చేయాలి. వాలుకు అడ్డంగా దుక్కి దున్నితే నీటి ప్రవాహం తగ్గి మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది.